## 10 హెచ్‌పీ మోటర్లెప్పుడైనా పెట్టిండ్ల..



శాయంపేట, నవంబర్ 22 : వ్యవసాయానికి ఇప్పటి వరకు ఎక్కడైనా 10 హెచ్‌పీ మోటర్లు పెట్టిండ్ల. ఆర్థిక భారంతోకూడిన పనిది. కాంగ్రెసోళ్లు అవగాహన లేక మాట్లాడుతున్నరు. 24 గంటల కరెంటుతో రైతులు బాగున్నరు. కరెంటు కోతలు ఉన్నప్పుడు కరెంటు షాక్‌తో, పాములు కుట్టి గత ప్రభుత్వంలో ఎంతో మంది రైతులు చనిపోయిండ్లు. నేను పొలానికి 3 హెచ్‌పీ మోటరుతో నీళ్లు పారించుకుంటున్న. పగలే పొలానికి నీళ్లు పెట్టుకుని రాత్రి సంతోషంగా ఇంటి వద్ద ఉంటున్నాను. కానీ కాంగ్రెస్ నేతలు 3గంటలే కరెంటు ఇస్తం, 10హెచ్‌పీ మోటర్లు పెడితే సరిపోతుందనడం వారి అవివేకానికి నిదర్శనం. రైతులకు కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంటు మాత్రమే కావాలి.

**- దాసరి రవి, రైతు, పెద్దకోడెపాక, శాయంపేట.**

## ధరణి రద్దు చేస్తే దళారుల రాజ్యమే..



శాయంపేట, నవంబర్ 22 : నాకున్న 1.10 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్న. ధరణి పోర్టల్‌తో లాభం జరిగింది. నాకు ఇరవై గుంటలు పట్టా అయింది. అంతకు ముందు కాలేదు. కాంగ్రెస్ వస్తే ధరణి రద్దు అంటున్నది. కానీ కాంగ్రెస్‌కు ఓటేయం. ధరణి రద్దు చేస్తే మాసంటోళ్లకు ఇబ్బంది అయితది. మధ్య దళారులు పైసలు రాబడుతరు. మళ్ల అధికారుల చుట్టు తిరుగుడే. పైసలు వసూళ్లు, పైరవీలతో తల పట్టుకోవాల్సిందే. మా ముగ్గురు అన్నదమ్ములకు భూముల పట్టాలు సులువుగా అయినయ్. పాస్‌బుక్కులు వచ్చినయ్. ధరణితో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉన్నం. రైతులకు మంచిచేస్తున్న కేసీఆర్‌తోనే ఉంటం.

**- మార్క సురేశ్, రైతు, శాయంపేట**



# రేపు భూపాలపల్లికి ప్రగతి ప్రదాత

- ఆశీర్వాద సభలో పాల్గొననున్న సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వెనుక ఏర్పాట్లు
- సభా స్థలి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర, ఎమ్మెల్సీ సారయ్య, జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి రానున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డికి మద్దతుగా భూపాలపల్లిలో నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. శుక్రవారం సీఎం కేసీఆర్ మంచిర్యాల, రామగుండం, భూపాలపల్లి, ములుగు ప్రాంతాల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొంటారు. ఈ మేరకు భూపాలపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం వెనుక గల ఖాళీ స్థలంలో సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం సభా స్థలి పనులు ప్రారంభం అయ్యాయి. బుధవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, నియోజకవర్గ ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య ఏర్పాట్లను పరిశీలించారు.



సభా స్థలిని నాయకులతో కలిసి పరిశీలిస్తున్న గండ్ర జ్యోతి

### విజయవంతం చేయాలి

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి**

ఈ నెల 24న భూపాలపల్లిలో జరగబోయే బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి పిలుపునిచ్చారు. బుధవారం ఆమె నాయకులతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం 4 గంటలకు సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారని, లక్ష మంది హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజలు బీఆర్ఎస్‌కు గ్రామగ్రామాన బ్రహ్మరథం పడుతున్నారని, ఈ క్రమంలోనే కేసీఆర్ ఎక్కడ సభ నిర్వహించినా విజయవంతం అవుతున్నదన్నారు. కేసీఆర్ పథకాలపై ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. ప్రజలను సభా స్థలికి తరలించేలా శ్రేణులు కృషి చేయాలన్నారు. ఆమె వెంట పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, కౌన్సిలర్ స్వామి, బీఆర్ఎస్ అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, నాయకులు బీబీ చారి, సింగనవేని చిరంజీవి, అల్లూరి కుమార్, బెద్దెల పోశయ్య, తిరుపతమ్మ, స్వప్న, బోడ పద్మ, వజ్రమణి తదితరులున్నారు.

## సీఎం సభను విజయవంతం చేయాలి

శాయంపేట , నవంబర్ 22 : ఈ నెల 24న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శాయంపేటలోని పార్టీ కార్యాలయంలో వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోసం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్నట్లు తెలిపారు. సభకు మండలం నుంచి పదివేల మందిని తరలిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలో గ్రామస్థాయిలో వార్డుల వారీగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో రాంశెట్టి లతాలక్ష్మారెడ్డి, మారపల్లి నందం, గాజె రాజేందర్, దుంపల శ్రీలతామహేందర్, దైనంపల్లి సుమన్, మామిడి అశోక్, పెంబర్తి సాంబయ్య, తోట శ్రీనివాస్, మారపల్లి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి, మండలాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి

## అనాథ పిల్లలకు సరుకులు అందజేత

శాయంపేట, నవంబర్ 22 : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన తెలంగాణ జాగృతి యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్ము అశోక్ అనాథ పిల్లలకు బుధవారం సరుకులు అందజేశారు. పరకాల పట్టణంలోని సీఎస్ఐ అనాథాశ్రమంలో తమ్మిశెట్టి సమ్మయ్య వర్ధంతి సందర్భంగా 50 కిలోల సన్న బియ్యం, నిత్యావసర సరుకులను సమ్మయ్య తనయుడు తమ్మిశెట్టి రంజిత్ కుమార్‌తో కలిసి అందజేశారు. అనాథ పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని, కావాల్సిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



అనాథ పిల్లలకు సరుకులు అందజేస్తున్న అశోక్, రంజిత్‌కుమార్

# గండ్రతోనే భూపాలపల్లి మరింత అభివృద్ధి

- భారీ మెజార్టీతో గెలిపించాలి
- వాడవాడలా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

కృష్ణకాలనీ, నవంబర్ 22 : బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డితోనే భూపాలపల్లి మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి, అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్ అన్నారు. బుధవారం గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపును కోరుతూ మున్సిపాలిటీలోని1వ వార్డు గడ్డిగానిపల్లి, సెగ్గంపల్లిలో, 26వ వార్డు టీ–2 క్వార్టర్స్‌లో చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, 14వ వార్డు జంగేడులో కటకం జనార్దన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి రమణారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. అలాగే 12వ వార్డులో వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, 8, 27 వార్డుల్లోని జవహర్‌నగర్, హైటెక్, జయశంకర్, రెవెన్యూ కాలనీల్లో ఫ్లోర్ లీడర్ గండ్ర హరీశ్‌రెడ్డి, 8వ వార్డు కౌన్సిలర్ నూనె రాజు, 2వ వార్డు ఫక్కీరుగడ్డ, 3, 4, 18, 19, 30, 20, 21 వార్డుల్లోని సీఆర్‌నగర్, రాజీవ్‌నగర్ కాలనీ, గాంధీనగర్, ఎల్‌బీనగర్, రెడ్డికాలనీ, బానోతువాడ, శాంతినగర్, హనుమాన్‌నగర్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేశ్, స్థానిక కౌన్సిలర్లు ఆకుదారి మమతారాయమల్లు, పిల్లలమర్రి శారదానారాయణ, నాగుల శిరీషాదేవేందర్‌రెడ్డి, జక్కం రవికుమార్, మాడ కమలాలక్ష్మారెడ్డి, భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడ హరీశ్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జిలు గుమ్మడి భాగ్యలక్ష్మి, బుర్ర రాజు, రడపాక రమేశ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. 5, 6 వార్డుల్లోని యాదవకాలనీ, కృష్ణకాలనీల్లో వార్డు ఇన్‌చార్జి పైడిపెల్లి రమేశ్, 6వ వార్డు కౌన్సిలర్ ఎడ్ల మౌనికా శ్రీనివాస్, 7వ వార్డు సీ–2 క్వార్టర్స్‌లో ఇన్‌చార్జి రత్నం సమ్మిరెడ్డి, 13వ వార్డు కాశింపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, స్థానిక కౌన్సిలర్ మంగళపెల్లి తిరుపతి, 15, 28 వార్డుల్లోని కాకతీయకాలనీ, ఇందిరానగర్, ఎండీ క్వార్టర్స్‌లో వార్డు ఇన్‌చార్జిలు బండారి రవి, బీబీ చారి ఇంటింటికీ తిరుగుతూ కారుగుర్తుకు ఓటువేసి గండ్రను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో 14, 26 వార్డుల కౌన్సిలర్లు ధార పూలమ్మ, పానుగంటి హరికాశ్రీనివాస్, బండారి సంపూర్ణ రవి, దొంగల ఐలయ్య, సింగనవేణి చిరంజీవి యాదవ్, కవ్వంపెల్లి శేఖర్, గండి శ్రీనివాస్, పెసరు నాగరాజు, కేవీ అశోక్, బాబర్ పాషా, మోకిడి అశోక్, రేణుకుంట్ల రాజేందర్, శ్యామ్, మధూకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గోరికొత్తపల్లిలో..

రేగొండ : గోరికొత్తపల్లి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మటిక సంతోష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి గెలుపు కోరుతూ దామరంచపల్లె, చిన్నకోడెపాక, రాజక్కపల్లె, చెన్నాపురం, జగ్గయ్యపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు రఘుసాల తిరుపతిరావు, వీరన్న, వెంకటేశ్, రవీందర్, తిరుపతి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



26వ వార్డు టీ-2 క్వార్టర్స్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

## సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి

శాయంపేట, నవంబర్ 22 : ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు భోజన సౌకర్యాలు పక్కాగా అందించాలని, ఎలాంటి ఫిర్యాదు రావద్దని భూపాలపల్లి జిల్లా నోడల్ అధికారి విజయ్‌భాస్కర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనం, టీ, టిఫిన్స్ సకాలంలో అందించాలని, ఎవరి నుంచి మాట రాకుండా చూడాలని కార్యదర్శులకు సూచించారు. మండల పరిధిలో 42 పోలింగ్ కేంద్రాలున్నాయని అక్కడికి వచ్చే స్టాఫ్‌కు అందుబాటులో ఉండాలన్నా రు. పోలింగ్ కేంద్రాలను శుభ్రంగా ఉంచాలన్నా రు. విద్యుత్ సౌకర్యం కల్పించి లైట్లు, ఫ్యాన్లు, టేబుల్స్ సమకూర్చాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి, కార్యదర్శులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో పొగాకు నియంత్రణపై అవగాహన

శాయంపేట, నవంబర్ 22 : మండలంలోని మాందారిపేట శివారులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ పొగాకు నియంత్రణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పొగాకు వాడకం ద్వారా వచ్చే దీర్ఘ కాలిక జబ్బులను వివరించారు. పొగాకును వాడొద్దని సూచించారు. క్యాన్సర్‌తో పాటు అనేక రోగాలు వస్తాయన్నారు. విద్యార్థులు పొగాకు వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి సాయికృష్ణ, సుగుణ, పీహెచ్ఎన్ నిర్మల, హెల్త్ అసిస్టెంట్ చలపతి, కేజీబీవీ ప్రత్యేక అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి బియ్యం అందజేత

శాయంపేట,నవంబర్ 22 : మండల కేంద్రానికి చెందిన షేక్ నాగూర్‌వలి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఎమ్మెల్యే గండ్ర, జడ్పీ చైర్‌పర్సన్ జ్యోతి సూచనలతో స్థానిక ఉప సర్పంచ్ దైనంపెల్లి సుమన్ ఆ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ. 6 వేల విలువైన బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట కిషన్, చక్రపాణి, దైనంపల్లి రాజు, మోహన్, దైనంపల్లి కిరణ్ బాబు, దైనంపల్లి పాపయ్య తదితరులున్నారు.



మృతుడి కుటుంబానికి బియ్యం అందజేస్తున్న సుమన్